# అస్పృశ్యత

— శ్రీసుభా



నేను విజయవాడలో బ్రహ్మచారిగా బ్రతుకుతూ గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాను. ప్రతి నెలా అన్నయ్య నాకు నాలుగైదు సంబం

ధాలు చూస్తాడు. అందులో కొన్ని అన్నయ్యకీ మరికొన్ని అమ్మకీ నచ్చవు.

నిజానికి అన్నయ్య తెచ్చే సంబంధాలు నాకూ నచ్చవు. నచ్చక పోవడానికి కారణం కస్తూరి. కస్తూరి వాళ్ళ అవుట్ హౌస్‌లో నేను అద్దెకుంటున్నాను. కస్తూరి బి. ఏ. చదువుతోంది. ఆ అమ్మాయిని చూస్తే నాకు తీయని బాధ శరీరంలో త్రాచుల్లా పాకుతుంది! ప్రతి సన్నివేశంలోనూ, ప్రతి సంఘటనలోనూ కస్తూరిని నా ప్రక్కన ఊహించుకోక పోతే నాకు వెల్తిగా వుండేది.

అప్పటికే కస్తూరితో నా స్నేహం ముదిరిందని నాకు తెలుసు.

ఇద్దరం కలిసి దొంగతనంగా దుర్గ గుడి వద్ద, పడమటి లంక దాటి కృష్ణ ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్ళం. ఎన్ని కబుర్లు... ఎంత సంతోషం... మరెంత ఆనందం-మా హృదయాల్లో కృష్ణ కన్నా వేగంగా, ఉధృతంగా ప్రవహించేదో మా ఇద్దరికే తెలుసు.

"మనం పెళ్ళి చేసుకుందాం."

"మీ వాళ్ళు ఒప్పుకుంటారా? మీరు బ్రాహ్మలు.... మేం హరిజనులం."

"మా వాళ్ళు ఒప్పుకోకపోతే వంద దారులున్నాయి."

"మీరు కాదంటే నాకు ఒకటే దారి- కృష్ణలో దూకడం." కస్తూరి నవ్వుతూ అంది.

"గజఈతగాడినై నిన్ను రక్షించుకుంటాను. సరేనా?"

కస్తూరి నవ్వేసింది. కృష్ణలో తరంగాలు కస్తూరి నవ్వుతో తృళ్ళిపడ్డాయి.

"రేపు శెలవు పెట్టి నేను ఇంటికి వెడుతున్నాను. మా వాళ్ళతో మాట్లాడతాను."

* * *

రైల్లో కూర్చుంటే, దారి పొడుగునా ఇంటికి వెళ్ళిన తర్వాత అన్నయ్యకీ-నాకూ, అమ్మకీ-నాకూ మధ్య జరిగే కోల్డ్‌వార్ గుర్తొస్తూనే వుంది.

కస్తూరిని గురించి నెమ్మదిగా మొదలు పెట్టి, ఆ పైన కథలా దాన్ని పెంచి చెబితే అమ్మ గుండెలు బాదుకోవచ్చు.

నాకు బాగా గుర్తు-వీధిలో ఎంగిలాకు తొక్కి వస్తే అమ్మ నూతి దగ్గరకు లాక్కెళ్ళి తల స్నానం చేయించేది. స్కూలు బట్టలు వేరే పెట్టుకోమనేది. స్కూల్లో బ్రాహ్మల పిల్లల ప్రక్కనే కూర్చోమనేది. ఎదిరించే ధైర్యం లేక అమ్మ మాట కాదనే

వాణ్ణి కాదు. కానీ ఏ కారణం కన్పించకుండా ఆచారాలు పాటించ డానికి నా మనసు ఒప్పుకునేది కాదు. అమ్మ నన్నొక్కణ్ణే కాదు. అన్నయ్యనీ, నాన్నగార్నీ చాలా విధాల ఈ కనీ కన్పించని అస్పృశ్యతను పాటించమని వేధించేది.

"మీరు పట్టే కేసుల్లో సగం మాల మాదిగలవి. వాళ్ళని దూరంగా కూర్చో బెట్టి ఆ సాక్ష్యాలూ అవి ఎలా చెప్పాలో నేర్పండి. ఫీజు చేత్తో పుచ్చుకోకండి. బల్ల మీద పెట్టమనండి" అనేది.

"గవర్నమెంటు ఉద్యోగాలు చేసే వాళ్ళు కులాలు పట్టుకుని వేళ్ళాడితే అర్థం వుంది. ఏ గుణ గణాలున్నా వాళ్ళకి చెల్లి పోతుంది.

"నేను ప్రజల మీద బ్రతికే మనిషిని. నాకు ముఖ్యం నా క్లయింట్లు. వాళ్ళకి న్యాయం చేయాలి గానీ కులం చూసి కేసు నడపను. ఆ లెక్కన అయితే నేను చెట్టు క్రింద ప్లీడర్ని అయిపోతాను. మన బ్రాహ్మల్లో ఘర్షణ పడి కోర్టు కెక్కగల వాళ్ళు అతి స్వల్పం." నాన్న అనేవాడు.

నాన్న మాటలు నాకు గుడిలో గంటల్లా వినబడేవి. మా ఇంటికి వచ్చిన వాళ్ళతో ఆప్యాయంగా మాట్లాడ్డం, వాళ్ళకు ఎవరికైనా ఇంటిలో ఆతిథ్యం యివ్వడం నా కెంతో నచ్చేది. ఓ రోజు మా స్వగ్రామం నుంచి మా రైతు వచ్చాడు. బండి కట్టుకుని ధాన్యం బస్తాలూ, కట్టెలూ తెచ్చాడు. మా రైతు పేరు బూసయ్య.

నాన్నగారితో మాట్లాడుతూ బూసయ్య, మా ఊళ్ళో తమ్ముడు ఏసుపాదం ఇంట్లో వుండి చదువుకుంటూన్న తన కూతురు గురించీ కొడుకు గురించీ చెప్తున్నాడు. నాన్నగారి పక్కలో పడుకున్న మూలంగా బూసయ్య మాటలు నా చెవిలో పడుతున్నాయి.

"పోనీలే! వాళ్ళనీ పొలం పనిలో పెట్టకుండా చదువు చెప్పిస్తున్నావ్. ఏం చదువుతున్నారు?"

"ఎనిమిదో తరగతండి."

"మా చిన్నాడు ఆ క్లాసే. మీ పిల్లల పేర్లేమిటి?"

"ఆడిది మా నాన్న పేరు జార్జండి. దానిపేరు ఎలిజబెత్."

నా సెక్షన్‌లో వున్న ఎలిజబెత్ నాకు గుర్తొచ్చింది. అవును- ఎలిజబెత్ బూసయ్యలానల్లగా వుంటుంది. కానీ ఆ నలుపులో కాంతి వుంది. నల్లని జుట్టు, మాసిన బట్టలు, సిరా మరకలు పూవులుగా మెరిసే పాత పరికిణీ కట్టుకుంటుంది.

వెనక బెంచీలో కూర్చున్నా

ఫస్ట్ మార్కులు తెచ్చుకునేది. క్లాసులో అందరూ ఆశ్చర్యపోయే వారు ఎలిజబెత్ మార్కులు చూసి. ఎలిజబెత్ గురించి ఎన్నో సార్లు సార్లు చెప్పాను అమ్మతో.

"ఎలిజబెత్ ఎవ్రా? కర్మ...."

"మన రైతు బూసయ్య కూతురుటమ్మా!"

"ఊఁ- సరేలే."

"బాగా చదువుతుంది."

"వెధవ చదువులు. ప్రతివాళ్ళకీ పాడు చదువుల పిచ్చి పట్టింది. మనూళ్ళో దీని తల్లి తోడులేక ఒక్కత్తే చస్తోంది."

"ఎలిజబెత్ అంటే మన దీనమ్మ కూతురు. అవునా?" అన్నయ్య అమ్మని అడిగాడు.

"నీ కెందుకురా చుట్టరికాలు? మీ చదువులు మీరు ఏడ్వండి!" అమ్మ కసిరింది.

"మాలవాళ్ళని చూడ్డం కాదు- వాళ్ళ మాటలు వింటేనే మీ అమ్మ మైలపడిపోతుందిరా!" నాన్న గారు నవ్వుతూ అనేవారు.

"వాళ్ళని కాగలించుకుని ఊరే గండి- నాకేం?"

"గాంధీగారు మనల్నందర్నీ ఆ పనే చేయమంటున్నారు."

"దేశానికి ఆయన తెచ్చే స్వాతంత్ర్యం మాటేమిటోగానీ ముందు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడు మహానుభావుడు."

రైలు ఏదో స్టేషన్‌లో ఆగి పెద్ద షంటింగ్‌కి గురి అయ్యింది. ఆ కుదుపుతో నెత్తిన పిడుగు పడ్డట్టయి ముందుకు తూలి పడబోయి, ఎదుటి సీటులోవున్న మరో వ్యక్తి సహకారంతో అపాయం నుంచి తప్పించుకో గల్గాను.

జీవితం కూడా ఎన్నో ఆటుపోటులనుంచి, అపాయాల నుంచి, సంతోషాల నుంచి కిందా మీదా ఔతుంది. మొదటి పాతిక సంవత్సరాల కాలం- మనిషి జీవితంలో చాలా సాదాగా గడిచిపోతుంది. ఆ తర్వాతే అగ్ని పరీక్షలు మొదలవుతాయి. వయసూ, వ్యక్తిత్వం కొలిమిలో కాలే బంగారం అవగల్గితే, మనిషి వెన్నెముక వున్న వాడనిపించుకుంటాడు.

తను....?

నాకు నవ్వొచ్చింది. దిగవల్సిన స్టేషన్ వచ్చింది. రైలు దిగి, బస్ మారి, రిక్షా! జీవుడు శరీరాలు మారినట్టే గమ్యం చేరడానికి ఎన్ని అవతారాలు ఎత్తాలో?! గుమ్మంలోంచి నన్ను చూసి, అన్నయ్య వదిన్ని కేక వేసి నా రాక చెప్పాడు. వంటింట్లోంచి మండువా వాకిట్లోకి వచ్చింది అమ్మ.

వాకిట్లో గోడకున్న నాన్నగారి ఫోటోకి చామంతి పూల దండ వేళ్ళాడుతోంది.

"సమయానికి వచ్చాడు. ఒరేయ్ స్నానం చేసిరా. నాన్నగారి ఆబ్దీకం ఇద్దరం కలిసి పెడదాం" అన్నయ్య అన్నాడు.

"నువ్వు కానిచ్చేయి. నాకు మెడలో ధన్యంలేదు. ఆబ్దీకాలు పెట్టడం నాకు నచ్చదు" అన్నాను.

"తప్పు మరిదీ! అత్తగారు బాధపడతారు" వదిన అంది.

"వాడ్ని అని లాభం లేదు. అయన పెంపకం అలాంటిది" అమ్మ కళ్ళు వత్తుకుంది.

* * *

సాయంకాలం దొడ్లో మంచాలు వేసింది వదిన. అందరం తలో మంచం మీద కూర్చున్నాం. అమ్మా, వదినా వసారా అరుగు మీద కూర్చున్నారు. వదిన మల్లె పూలు దండ కడ్తోంది. నెమ్మదిగా మొదలు పెట్టి నేను కస్తూరి గురించి చెప్పాను. అన్నయ్య వులిక్కి పడ్డాడు. అమ్మ కళ్ళల్లో దుఃఖం సాగర రూపం దాల్చబోతోంది. వదిన చేతిలో దిగిన సూది పోటుతో స్రమాన్పడి నన్ను చూస్తోంది.

"ఆఖరికి మాలదాన్ని పెళ్ళాడతాననే వరకూ వచ్చావన్న మాట!" అమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

"తప్పేమిటమ్మా? అసలు మన కులాలన్నీ వృత్తి ధర్మానికి కట్టుబడి ఏర్పడినవే! న్యాయంగా చూస్తే ముందు బ్రాహ్మడే అన్ని కులాల వాళ్ళనీ పెళ్ళాడి కుల నిర్మూలనకి దోహదం చేసేవాడు. కానీ ఈ వేళ అదే బ్రాహ్మడు ఈ విషయంలో వెనకాడ్డం చిన్నతనం."

"ఈ శాస్త్రాలు కట్టిపెట్టు. ఆ పలివెల వాళ్ళు పదివేలు ఇస్తామంటున్నారు. చక్కగా పెళ్ళి చేసుకో!"

నేను బయటకు వచ్చేశాను. పెద్ద బజారు పట్టి నడవడం మొదలు పెట్టాను. ఊరికి దూరంగా క్లబ్. క్లబ్‌కి ఎదురుగా మధ్యతరగతి మానవుడిలా చిన్న చర్చి. చర్చి నానుకుని హరిజన వాడ.

ఎన్నో సాయంకాలాలు ఆ రోడ్డుమీద ఆడుతూ పాడుతూ తిరిగాను. బాధలూ, భయాలూ విస్మరించి గాలిపటంలా పరిగెట్టాను అదే రోడ్డు మీద. ఎంతో మంది స్నేహితులతో భుజాలు రాసుకుంటూ నడిచాను. కానీ ఈవేళ నా ఊరు నాకు కొత్తగా వుంది. కుల పెద్దగా మారి నన్ను లక్షల ప్రశ్నలు వేస్తోంది!

చర్చి నానుకుని వున్న సందులోకి నడిచాను. దూరంగా పెంకు

టిల్లు. అవును- అది ఎలిజబెత్ వాళ్ళ ఇల్లు. ఎలిజబెత్ హాస్టలో వుండి ఆదివారాల్లో చిన్నాన్న ఏసు పాదం ఇంటికి వచ్చేది. ఏసుపాదం చాలా మంచివాడు. తరుచు నాన్న దగ్గరకు వచ్చేవాడు. ఆ వాడకి పెద్దగా బ్రతికేవాడు.

ఎలిజబెత్, నేనూ విడిపోయి ఐదేళ్ళు అయింది. ఆమె స్కూల్ ఫైనల్‌తో చదువాపి సెకండ్రీ గ్రేడ్ ట్రయినింగ్‌కి వెళ్ళిం దన్నారు.

గుమ్మంలో నుంచున్న ఏసు పాదం నన్ను చూసి, "ఎవరదీ?" అన్నాడు.

"నేను సుబ్బారావుని."

"ఏ సుబ్బారావు?"

"ప్లీడరు శివరామయ్యగారి సుబ్బారావుని" అన్నాను ఏసు పాదం త్వరగా పోల్చుకుంటాడని.

"మీరా? రండయ్యా! ఇలా వచ్చినారేమిటి? కబురు పెడితే నేనే వచ్చే వోణ్ణి కదా" అన్నాడు మర్యాదగా.

నేను నవ్వేశాను. ఏసుపాదం కర్ర కుర్చీ తెచ్చి అరుగు మీద వేశాడు. ఏసుపాదం ఇల్లు పూర్వం లానే వుంది. కానీ వీధి గుమ్మా లకు కర్టెన్స్ వచ్చాయి. ఆ వాడలో మిణుకు మిణుకు మని వెలిగే వీధి దీపాలు పోయి ఎలక్ట్రిసిటీ దీపాలు వచ్చాయి.

నేను ఎలిజబెత్ గురించీ, జార్జి గురించీ అడిగాను.

"గుంటూరులో ఆళ్ళ చిన్నమ్మ దగ్గర వుండి అక్కడే టీచరమ్మ ఉద్యోగం చేస్తోంది. ఏటో బాబూ! ఈ సదువులొచ్చి పిల్లల్ని పచ్చుల్లా ఎగరేసుకు పోతుండాయి. జార్జిగాడు ఏలూర్లోవుంటున్నాడు." ఏసుపాదం కాసేపు ఆగి, "బాబూ! తమ తండ్రిగారు పోయి శానా దినా లయింది గదా! మీ లగ్గం అయి నట్టేనా?" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడు ఆ పని మీదే వచ్చాను."

"సుబం. బేగి ఓ ఇంటాడివి కాండి."

"అమ్మకీ, అన్నయ్యకి ఇష్టం లేని పెళ్ళి చేసుకోబోతున్నా. దాం తోనే పేచీ వచ్చింది."

"అదేటి బాబూ?"

"విజయవాడలో నా స్నేహితు రాలుందిలే- కస్తూరని. మీ వాళ్ళ అమ్మాయే. పైగా వాళ్ళు నీకు చుట్టాలవుతారని కస్తూరి చెప్పింది. కస్తూరి తల్లి పేరు దీనమ్మగారు."

ఏసు పాదం ఏం మాట్లాడలేదు. నన్ను రాయిలా మారి చూస్తు న్నాడు.

"ఏమిటి అలా చూస్తున్నావ్?" అన్నాను.

ఏసుపాదం ఏదో అనబోయాడు. ఇంతలో దూరం నుంచి వచ్చిన రిక్షా ఏసుపాదం ఇంటి ముందు ఆగింది. అందులోంచి దీనమ్మ, జార్జి, ఎలిజబెత్ తండ్రి బూసయ్యా దిగారు. గుమ్మం మెట్లు ఎక్కుతూ నన్ను చూసి ఆశ్చర్యపోయారు.

* * *

నేను ఇంటికి తిరిగి రావడంతో తిరిగి అమ్మా, అన్నయ్యా నాకు బ్రెయిన్ వాష్ మొదలు పెట్టారు. మర్నాడు ఉదయమే నా ప్రయాణం.

అమ్మ రాత్రి పదిగంటలవరకూ మాట్లాడి,మాటల్లో విచారం కన్నీరు కురిపించి, తన మీద ఒట్టు పెట్టుకుని లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"వెర్రి వెధవలా దాన్ని పెళ్ళాడతా నంటావేమిట్రా? వాళ్ళకి నీతీ, జాతీ వుండదు. మగాడివి నీకు కమిట్‌మెంట్ ఏమిటి? కావాలంటే వుంచుకో. ఇలాంటి పన్లు తాతయ్యా చేయలేదా? నాన్న చేయలేదా? పొలంలో పడుకున్న ప్రతి ఆడ దాన్నీ వాళ్ళు ఇంటికి తేవడం మొదలు పెడితే మనకో ఊరు సరిపోదు. పెళ్ళాన్ని సెలెక్ట్ చేసుకోవడం వేరు-మనసు పడ్డ దాన్ని వాడుకోవడం వేరు."

అన్నయ్యని చూస్తే నాకేమనాలో తోచలేదు. అన్నయ్య సతీ సాంప్రదాయాల్నీ, వంశ పారంపర్యంగా చెడుని మోసుకొస్తూన్న పెద్దల్నీ చూపి జబ్బలు చరుచుకోవడం నాకు అసహ్యం వేసింది. నీతిని-పగటి నీతిగా, రాత్రి నీతిగా విడదీసి వ్యాఖ్యాతగా వినిపించడం చూస్తే హాహాకారాలు చేసే క్రూర మృగాలు గుర్తొచ్చాయి.

నుదుట బొట్టూ, దైవ భక్తీ, ఆచారాలూ తొలిగించి అన్నయ్య లోపలికి చూస్తే నాకు అన్నయ్య లోపల తిష్ట వేసుకుని కూర్చున్న నిజమైన అస్పృశ్యుడు కన్పించాడు!

వీధి అరుగు మీద మడత మంచం వేసుకుని పడుకున్నాను. దూరంగా వీధి లైటు పురుగుల వాత పడ్డ వీధి మానసిలా వుంది. లైటు స్తంభం క్రింద ముడుచుకు పడుకున్న రెండు నల్ల కుక్కలు. దాని పక్కన చెత్త కుండీ! దుప్పటి సరిజేసుకుంటున్నాను. ఎవరో ఇద్దరు వ్యక్తులు నడిచి వస్తున్నారు. సందు మలుపులోంచి కన్పించారు. ఒక వ్యక్తి దుప్పటి వంటి నిండా కప్పుకున్నాడు. రెండో వ్యక్తి తలకి తువ్వాలు చుట్టుకున్నాడు.

"ప్రకాశం బాబూ!" అంది దుప్పటి కప్పుకున్న నీడ.

"ఎవరూ?" అన్నాను.

"నేను బూసయ్యని."

"నేను సుబ్బారావుని" అంటూ మంచం మీద నుంచి లేచి నుంచున్నాను. జార్జి నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. బూసయ్య పనీ అంతే అయ్యింది.

"ఏమిటిలా వచ్చారు?"

"మీ సంగతి తేల్చుకోవాలని."

నాకు నవ్వొచ్చింది జార్జి మాటలకు. "నా సంగతి తేల్చుకోవడానికి అన్నయ్య దేనికి? నే వున్నానుగా" అన్నాను.

"ఇంటి పెద్ద...."

"నా విషయంలో నాకు నేనే పెద్ద. వాళ్ళు మంచి నిద్రలో వున్నారు- పదండి. అలా సత్రపు అరుగుల మీద కూర్చుందాం."

ముగ్గురం కలిసి సత్రం దగ్గరకు వచ్చాం. నేను స్తంభాన్నానుకుని కూర్చున్నాను. బూసయ్య మా ఇంట్లో మాదిరి మరో స్తంభాన్నానుకుని కూర్చున్నాడు. జార్జి కూర్చోలేదు. జేబులోంచి సిగరెట్ తీసి కేర్ లెస్‌గా వెలిగించుకుని పుల్లని బొటనవేలూ చూపుడువేలుతో కలిపి త్రోసేశాడు.

"బాబూ! బెజవాడలో వుండే నా చెల్లెమ్మ దీనమ్మ చెప్పింది! మీరిలా చేస్తే ఎలా? కస్తూరిని పెళ్ళి చేసుకుంటామని చెప్పి...."

"నాన్నా! నువ్వు విషయాలు నాన్చకు. మనం వెళ్ళాలి మళ్ళీ."

"అవును బూసయ్యా! కస్తూరిని నేనే ఇంట్లో చెప్పమన్నాను. మేం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం."

"కానీ బాబూ! మా వాళ్ళెవరికీ ఈ మనువిష్టం లేదు."

"ఎందుకు? కారణం ఉండాలిగా?" అన్నాను నవ్వుతూ. జార్జి కోపంగా నా వైపు చూశాడు.

"అవన్నీ నీకు చెప్పాల్సిన అవసరంలేదు. ఐనా నిన్ను నమ్మమని ఎవరు చెప్పారు? అంతా దొంగలు. మీ అన్ననడుగు కావాలంటే చెప్తాడు. ఎలిజబెత్‌ని పెళ్ళి చేసుకుంటానన్నాడు. మా ఇంటి చుట్టూ తిరిగాడు. ఆఖరికి దాని బ్రతుకు నాశనం చేశాడు. మా నాయన మొహం చూసి పూరుకున్నాం గానీ లేకపోతే అప్పుడే నరికి పారేసేవాళ్ళం. నువ్వయినా జాగ్రత్తగా వుండు. అటూ ఇటూ అయితే .."

"నోర్ముయ్ ఎదవా! నువ్వు పోరా. అసలు నాతో రావద్దని సెప్పానా! నువ్వు పో!" బూసయ్య జార్జిని కసిరాడు.

"వాళ్ళకి కొమ్ము లిస్తావు దేనికి?"

"నువ్వింటికి పోరా అంటే..."

జార్జి తువ్వాలు భుజంమీద వేసుకుని మరో సిగరెట్ వెలిగించుకుని నా వైపు క్రూరంగా చూసి వెళ్ళిపోయాడు.

"నాకు ఈ విషయాలేం తెలియవు బూసయ్యా! అన్నయ్య ఇలా చేశాడా?" ఆలోచనలు ముసురుతున్నాయి.

బూసయ్య అలానే కూర్చున్నాడు.

"బూసయ్యా! నా సంగతి నేను చెప్పడం బావుండదు. కస్తూరిని నేను దగాచేయను. సరేనా? వాళ్ళ అమ్మగారితో నువ్వు చెప్పు."

"అది కాదండీ!"

"కస్తూరి మీ వాళ్ళంతా కేకలేస్తే ఏడవలేదూ? నిజం చెప్పు! బాధ పడలేదూ?"

"నిజమే బాబూ! కస్తూరి ఒకటే ఏడుస్తోంది. బాబూ! ఎలిజబెత్‌ని సీ అన్నగోరు నాశనం చేశాడని నాకు కచ్చలేదు. దాని దురదృష్టం అట్టా వుంది. అందుకే దీనమ్మతో చెప్పాను. అదీ నా పూసు వినడంలా."

"ఎందుకట?"

బూసయ్య అటూ ఇటూ చూసి నెమ్మదిగా అన్నాడు-"బాబూ! మీ కుటుంబం గురించి నాకు చాలా వివరంగా తెలుసు. మా తాతలనాటి నుంచీ మీ పొలాల్లో పనిచేసినోళ్ళం. నువ్వు కస్తూరి పిల్లని

---


వి[illegible] నిలయం

వచ్చే సంచిక నుండి

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ" |
| అర్ధసంవత్సర చందా | 21 రూ" |
| విడి ప్రతి | 3-50 రూ" |

పెళ్ళాడు. దీనమ్మ, జార్జిగాడు కాదంటే ఏం బయపడమాకు" బూసయ్య ఆగి మళ్ళీ అన్నాడు-

"కస్తూరి ఎవరో అనుకో మాకు. మీ అత్తమ్మ కూతురు. నీకు వరస వుద్ది బాబూ! ఈ చుట్టరికం నాకూ, నాయనగారికీ తప్ప దేవుడికి కూడా తెలవదు."

నేను ఆశ్చర్యంగా చూశాను.

"మీ అత్తమ్మగోరు మనూళ్ళో ఉండేదయ్యా! పాపం శానా మంచిది. ఎదవ ఎవడో దగా చేసిండు. అప్పుడాయమ్మ నూతిలో పడబోనాది. మీ నాయనగోరాపినారు. ఎట్టాగో గండం గడిసింది. మీ అత్తమ్మ ఆడబిడ్డని కంటే ఆ బిడ్డని నా చేతుల్లో ఎట్టారు మీ అమ్మగోరు. నేను దూరానున్న దీనమ్మకాడుంచి నాను."

నేనేం మాట్లాడలేదు.

"దీనమ్మతో ఇవరంగా నేచెప్తా నయ్యా! మీరు ఇదవకండి. నేను ముసిలి ఎదవని గానీ మూర్ఖపు ఎదవని కానుగా బాబూ! ఎలిజబెత్ బతుకు పాడయినాదని మీ బతుకులో నిప్పులోస్తే బగమంతుడు వూరుకుంటాడా?"

"బాధపడకు బూసయ్యా!"

"మరి నే ఎడతాను బాబూ!"

నాకు మాటలు రాలేదు. అంటరానితనంతో బూసయ్య, చుట్టూ సంఘానికి అపవిత్రుడుగా మిగిలిన మనిషి. కానీ అదే అపవిత్రుడు చీకటి తప్పుచేసిన వాళ్ళ పాపాన్ని తన చేతుల్లోకి తీసుకుని సాకాడు. ఈ పని ఏ సత్‌పురుషులూ చేయరు, చేయలేరు. చేతులు మైల పరుచుకుందుకు సుతరామూ ఇష్టపడరు. పై తరగతుల వాళ్ళతో నవ్వులూ పువ్వులూ పంచుకోవడానికి నోచుకోకపోయినా, ఇలా తప్పులు కాయడానికి క్రింద తరగతి వాళ్ళు ఏనాటినుంచో ముందుకు వస్తూనే వున్నారు.

కస్తూరి జీవిత రహస్యం చెబితే అమ్మా, అన్నయ్యా, వదినా హర్షిస్తారా? వూహూ—అమ్మ ఎప్పుడో ఆ విషయం మర్చిపోయి ఉంటుంది. విని కట్టు కథ అని కొట్టి పారేస్తుంది. కస్తూరి ఎవరి కడుపున పుట్టిందన్నది కాదు అమ్మకీ, అన్నయ్యకీ కావలసింది ఈరోజు? కస్తూరి ఎవరన్నదే వాళ్ళ బాధకీ, భయానికి ఆధారం ఈనాడు? కస్తూరి లోకం దృష్టిలో అస్పృశ్యురాలు. అస్పృశ్యురాలిగానే కస్తూరిని నా భార్యగా వూహించుకున్నాను. నాకు గర్వం వేసింది- ఆ వూహతో. సంతోషం వేసింది- ఆ తలపుతో. *